
● ప్రేమకథ



ఆమె ఒక్కసారిగా అతని చెయ్యి పట్టుకుని లాగింది! అతను బెడ్‌మీద పడ్డాడు.

— ఎన్. శివ నాగేశ్వరరావు

యాపిల్‌రంగు మారుతీకారు వచ్చి తనపక్కనే ఆగడంతో, ఒక్కక్షణం ఆగి కుతూహలంగా కారులోకి చూశాడు రవిచంద్ర. స్టీరింగ్ ముందున్న అందాల చిన్నది కొద్దిగా ఒంగి కారు ఫ్రంట్ డోర్ తెరిచి 'హలో రవిచంద్ర! ప్లీజ్ గెటిన్!' అంది.

# PLEASE GET IN

ఆమె పలకరింపును బట్టి బాగా పరిచయమున్న వ్యక్తి అయివుండాలి అనుకున్నాడు రవిచంద్ర. ఆమె ఎవరో జ్ఞాపకానికి రాలేదు. అయితే.. ఎక్కడో చూసిన జ్ఞాపకం.

'సారీ! మీరెవరో జ్ఞాపకం రాలేదు' అన్నాడు రవిచంద్ర క్షమార్పణ కోరుతున్న ధోరణిలో. ఆ అమ్మాయి అందంగా నవ్వి 'చెప్తాను. ముందు కారెక్కండి' అంది. ఆమె స్వరం మృదుమధురంగా వుంది.

తప్పనిసరై రవిచంద్ర ఫ్రంట్ సీట్‌లో కూర్చుని డోర్ లాక్ చేశాడు. ఆమె కారు స్టార్ట్ చేసి పోనిస్తూ 'ఏం చేస్తున్నారు?' అని ప్రశ్నించింది. 'ప్రస్తుతానికి నిరుద్యోగిని' అన్నాడతను. 'మీవంటి బ్రిలియంట్స్‌కి ఉద్యోగమివ్వ లేని ఈ ప్రభుత్వాన్ని 'ఏమనాలి?' అందామె రవ్వంత ఆవేశంగా.

'అందరూ ఉద్యోగాలకు ఎగబడితే వాళ్ళు మాత్రం చేయగలిగింది 'ఏముంది?' అన్నాడు రవిచంద్ర.

కొంచెం సేపు తరువాత 'ఇంతకూ మీరెవరో చెప్పనేలేదు' అన్నాడు రవిచంద్ర. ఆమెను మామూలు మూడ్‌లోకి తెస్తూ. ఆమె చిన్నగా నవ్వేసి 'గోల్డ్ మెడలిస్ట్ అయివుండీ నేనెవరో గుర్తుపట్టలేకపోవడం వెరీ షేమ్!' అంది.

'సిగ్గుపడవలసిన విషయమే! ఒప్పుకుంటున్నాను. ఇప్పుడు చెప్పండి మీరెవరో!' అన్నాడు రవిచంద్ర. 'అయామ్ కావ్య!' అందా యువతి.

'కావ్య! ఉహూ ఇంకా మీరెవరో జ్ఞాపకం రాలేదు' అన్నాడు రవిచంద్ర. 'ఇంకా విషయం వదిలేయండి. సమయం చూసి నేనే చెప్తాను' అంది కావ్య.

'మీరెవరో చెప్పవద్దు. పోనీ, కారులో ఎక్కడికి తీసుకువెళ్తున్నారో అడగవచ్చా?' అన్నాడు రవిచంద్ర. 'అందమైన అమ్మాయి లిఫ్ట్ ఇస్తున్నప్పుడు 'ఎక్కడికి?' అని అడిగిన మగాడ్ని మిమ్మల్నే చూశాను' అంది కావ్య నవ్వుతూ.

'జీవితంలో కొన్ని సంఘటనలు వినోదంతో మొదలై విషాదంతో ముగుస్తాయి. అందుకే సాధ్యమైనంత వరకు అటువంటి స్థితి రాకుండా జాగ్రత్తపడతాను' అన్నాడు రవిచంద్ర.

'మీరన్నది నిజమే! కానీ, అందినంత వరకు ఆనందం అనుభవించి.. కొద్దిపాటి విషాదాన్ని మరచిపోగలిగితే.. జీవితం స్వర్గధామం అవుతుందేమో కదూ!' అంది కావ్య.

ఆమె, అతనితో మాట్లాడుతున్నా రోడ్డువంక చూస్తూ జాగ్రత్తగా కారు డ్రైవ్ చేస్తున్నది. రవిచంద్ర ఆమెను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

కారు ఒక రెస్టారెంట్ ముందు ఆగింది. ఆమె కారుదిగి అతని వైపు వచ్చి డోర్ ఓపెన్ చేసి 'ప్లీజ్ గెట్‌డౌన్' అంది. 'ఎందుకు?' అని ప్రశ్నించాడు రవిచంద్ర.

ఆమె మనోహరంగా నవ్వి 'ఎందుకు? ఏమిటీ? అన్న ప్రశ్నలు మేధావులమ సదా వెన్నంటి వుంటాయనుకుంటాను. మీరు దిగితే చల్లటి ఐస్‌ఫ్రూట్‌తో సేద తీరుస్తాను' అంది.

రవిచంద్రకు ఆమె ఎవరో? ఎందుకు తనతో అంత సన్నిహితంగా మెలుగుతున్నదో అర్థం కాలేదు. తెలుసుకోవాలన్న క్యూరియాసిటీ పెరిగింది.

కారుదిగి ఆమెను అనుసరించాడు. రెస్టారెంట్ ఎయిర్‌కండిషన్డ్ కావడంతో శరీరానికి ఎంతో హాయిగా వుంది. ఆమె ఐస్‌క్రీమ్‌కి ఆర్డరిచ్చింది.

'సారీ మేడం! నా పర్స్ ఖాళీ!' అన్నాడు రవిచంద్ర. 'నో ప్రాబ్లెమ్. అయినా మీరు నా గెస్ట్.మీచేత డబ్బు ఖర్చు చేయిస్తానా?' అంది కావ్య.

ఆమె డబ్బుకోసం తన మీద గేలం విసురుతున్నదేమో, అన్న శంక తీరిపోయింది. రవిచంద్ర చూపుడు వ్రేలితో కొద్దిగా పెరిగిన గెడ్డం స్పృశించుకొని 'ఈరూపం చూసి డబ్బు గలవాడు అని ఎవరు అనుకోగలరు?' అని చిన్నగా నవ్వుతున్నాడు.


అతని నవ్వు గమనించిన కావ్య 'ఆ నవ్వుకు కారణం చెప్తే మేమూ నవ్వుతాం కదా?' అంది. 'నవ్వుతారు.. అయితే నాలా చిరునవ్వు కాదు. పగలబడి మరీ నవ్వుతారు. అందుకే చెప్పను' అన్నాడు రవిచంద్ర.

ఐస్‌క్రీమ్ కప్స్ వచ్చాయి. రవిచంద్ర ఐస్‌క్రీమ్ టేస్ట్ చేస్తుండగా 'ఆడపిల్లకు.. ఐస్‌క్రీమ్ కప్పకు పోలిక వుంది కదూ?' అంది కావ్య. 'ఎలా?' అన్నాడు రవిచంద్ర. 'ఇష్టమైన వారు తాకితే ఇట్టే కరిగిపోతారు' అంది. ఆ మాట అనేటప్పుడు ఆమె కళ్ళు అరమోడ్పులయ్యాయి. ఆమె గొంతు( జీరబోయింది

టేబుల్ క్రింద ఆమె కాలు అతని పాదాన్ని తాకింది. రవిచంద్రలో ఎక్కడో కదలిక.

అతను, ఆమెవైపు పరిశీవలగా చూశాడు. మెరిసే కళ్ళు.. కోనేరు లాటి ముక్కు.. పల్చటి చెక్కిళ్ళు..






దొండపండు రంగు పెదవులు.. నవ్వితే తళుకున మెరిసే పలువరస.. నుదుటి మీద బొట్టు లేదు. బాబ్డ్‌హెయిర్.. స్లీవ్‌లెస్ జాకెట్.. పసుపురంగు చీరె, బోర్డర్ మీద రంగురంగుల పూలు ప్రింట్ చేయబడి వున్నాయి. మెడలో పగడాల నెక్లెస్ వుంది. ఒక చేతికి డైమండ్స్ పొదిగిన గాజులు. మరో చేతికి ఖరీదైనరిస్ట్ వాచి. చేతి వ్రేలుకి నవరత్నాలు పొదిగిన రింగ్ అందంగా మెరుస్తున్నది. అంతకుమించి శరీరవర్ణం సువర్ణ భయంతోమెరుస్తున్నది. అప్రయత్నంగా రవిచంద్రదృష్టి ఆమె ఎదపొంగుల మీద పడింది. 'విశ్వసుందరికి తీసిపోదు' అనుకున్నాడు.

'పరిశీలన పూర్తి అయిందా?' అంది కావ్య. ఆ ప్రశ్నకు అతని ముఖం కందింది. ఐస్‌క్రీమ్ కప్ ఖాళీ అయింది.

ఆమె బిల్ పే చేసి పైకి లేచి 'ప్లీజ్ కమ్!' అంది. రవిచంద్ర ఆమెకురెండడుగుల వెనక నడుస్తూ ఆమె వంక చూశాడు. ఆమె చాలాభాగం అనాచ్ఛాదితంగా కనిపిస్తూ కవ్వించే రీతిలో వుంది. చీర, జాకెట్టుకూ మధ్య కండపట్టి పుష్టిగా వుంది. ఆమె నడక హుందాగా వుంది.

అతను అడుగులు త్వరగా వేసి ఆమెను సమీపించాడు. ఆమె అతని వంక చూసి ఏదో అడగబోయి ఊరుకుంది. అది గమనించిన రవిచంద్ర 'అడగండి' అన్నాడు. 'మరేంలేదు. బేక్‌వ్యూ ఎలా వుంది?' అందామె. రవిచంద్ర మరోసారి సిగ్గుపడి 'సారీ' అన్నాడు. 'సారీ ఎందుకు? అందాన్ని చూడడం తప్పుగా నేను భావించను' అంది కావ్య. అతను మౌనం వహించాడు.

ఒక్క క్షణం తరువాత 'ఐస్ క్రీమ్ కప్ చూస్తూ లొట్టలు వేయడం ఎందుకు? కప్ ఓపెన్ చేసి సిప్ చేయవచ్చుగా?' అందామె. ఆమె భావం సరిగానే కేచ్ చేశాడు రవిచంద్ర.

'మీరెవరో చెప్పనే లేదు. అన్నాడు. 'మళ్ళీ మొదటికొచ్చారు. ఓ.కె. ఇక చెప్పేస్తాను. ఫాలోమీ!' అని కారెక్కింది కావ్య.

అప్పుడే చిరుచీకట్లు అలుముకుంటున్నాయి.రవిచంద్ర కారులో ఆమె పక్కనే కూర్చున్నాడు. పదినిముషాల ప్రయాణం తరువాత కారు ఓ ఖరీదయిన బంగళా ముందు ఆగింది.

మెయిన్‌గేట్ దగ్గరున్న గూర్ఖా కావ్యను చూడగానే వినయంగా విష్ చేసి గేట్ తెరిచాడు. కావ్య కారుని లోపలికి పోనిచ్చి పార్క్ చేసి క్రిందకు దిగి 'ఇదే మాయిల్లు. ప్లీజ్ కమ్!' అని రవిచంద్రను ఆహ్వానించింది.

ఆమె ఆహ్వానంతో అతని భృకుటి ముడిపడింది. 'ఎవరీ అమ్మాయి. నన్నెందుకు లోనికి ఆహ్వానిస్తున్నట్టు? తెలీకుండా ఏదైనా ఉచ్చులో చిక్కుకోవడం లేదు కదా?' అని ఆలోచించింది.

అతని ఆలోచన గమనించిన కావ్య కారు డోర్ ఓపెన్ చేసి చనువుగా అతని చేయి పట్టుకుని 'రండి' అంది. రవిచంద్ర ఆమెను అనుసరించాడు.

ఆ బంగ్లాలో వేరేవారెవరూ లేరు. కార్పెట్స్.. వాల్ డెకరేటర్స్.. అడుగడుగునా రిచ్‌నెస్ కనిపిస్తున్నది.

ఆమె, అతనిని డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోబెట్టి ఫ్రిజ్ ఓపెన్ చేసి కూల్‌డ్రింక్ తీసి అతనికి అందించింది. అతను మౌనంగా అందుకున్నాడు.

'పది నిముషాల్లో వస్తాను' అని ఆమె లోనికి నడిచింది. రవిచంద్ర కూల్‌డ్రింక్ త్రాగుతూ ఇంటిని పరిశీలించసాగాడు.

పదినిముషాల్లో కావ్య వచ్చింది.ఫ్రెష్గా స్నానం చేసినట్టుంది. ఒంటి మీద అక్కడక్కడ నీటిబిందువులు ముత్యాల్లా మెరుస్తున్నాయి. ఆమె ఇప్పుడు నైటీలో వుంది. నైట్ ట్రాన్స్‌పరెంట్ కావడంతో ఆమె షేపులు కనిపిస్తూ ప్రవరాఖ్యుడినైనా పిచ్చివాడిని చేసేలా వున్నాయి.

ఆమె అందాన్ని ఒకసారి చూసి తలతిప్పుకున్నాడు రవిచంద్ర. అది గమనించిన కావ్య 'ఒకసారి ఇటురండి' అని మేడమెట్లు ఎక్కింది.

రవిచంద్ర ఆలోచనలో పడ్డాడు. ఆమె కారు ఎక్కమంటే ఎక్కడం.. రెస్టారెంట్‌కి తీసుకొని వెళ్తే ఐస్‌క్రీమ్ తినడం.. ఇంటికి తీసుకువచ్చి ఆహ్వానిస్తే లోనికి రావడం.. తనెందుకిలా ప్రవర్తిస్తున్నాడు? ఆమె ఎవరో తెలుసుకోవాలన్న క్యూరియాసిటీనా? లేక ఆమె అందం మత్తులో పడి చిత్తుకావడమా?.. అవి కొంతవరకే కారణం! అంతకు మించిన కారణం ఆమె పట్ల హృదయంతో కలిగిన ఆత్మీయతా భావం.

రవిచంద్ర ఆమెను అనుసరించాడు. ఆమె బెడ్‌రూమ్ చేరింది. అతను అది బెడ్‌రూమ్‌గా గమనించి లోనికి అడుగిడక క్షణం సందేహించాడు. అది గమనించిన కావ్య 'దీనిని బెడ్‌రూమ్ అంటారు. లోనికి రావద్దు' అంది.

రవిచంద్రలోనికి ఎంటరయ్యాడు. కావ్య బెడ్‌మీద వాలింది. నైటిలోని ఆమె పరువాలు బరువుగా ఊగాయి.

ఆమె రవిచంద్ర వంక చూస్తూ 'ఆలస్యం చేస్తే ఐస్‌క్రీమ్ కరిగిపోతుంది' అంది. రవిచంద్ర అది ఖాతరుచేయక 'మీరెవరో తెలుసుకోవాలనే మీ వెంట వచ్చాను సారీ! వస్తాను' అన్నాడు.

కావ్య ఒక్కసారిగా అతని చేయి పట్టి లాగింది. 'అది ఊహించని అతను ఒక్క ఉదూటున ఆమె మీద పడ్డాడు. ఫోమ్ బెడ్ మెత్తగా మూలిగింది.'

తన శరీరం, ఆమె శరీరాన్ని తాకగానే అతను మధురానుభూతికి గురయ్యాడు. ఆమె ఒంటిమీద నుంచి వస్తున్న పెర్ఫ్యూమ్ వాసన.. ఆమె ఒంటి నునుపు.. అంతకుమించి తన ఛాతిని తాకుతున్న ఆమె యవ్వన గిరులు.. అతనికి క్షణం సేపు స్వర్గం కనిపించింది.

అతను తేరుకుని ఆమె నుండి దూరంగా జరిగి 'మేడం! ఈ తప్పు చేయడం నాకిష్టం లేదు. ఎందుకంటే.. నా భార్య పవిత్రంగా వుండాలని ఎలా కోరుకుంటానో.. నేనూ అలానే వుండాలనుకుంటాను' అన్నాడు.

'నా భర్త పవిత్రంగా వుండడం లేదు రవిచంద్రా! నేను మాత్రం ఎందుకు పవిత్రంగా వుండాలి?' అంది కావ్య. ఆమె మనసు అతనికి అర్థమయింది. ఆ తప్పు ఆమె ఎందుకుచేయాలనుకుంటుందో అర్థమయింది.

'కావ్యగారూ! గంగానది ఎదుటి వారి పాపాలను పరిహరిస్తుందే గానీ, తాను పాపపంకిలం అవదు. నా దృష్టిలో స్త్రీ అటువంటి గంగానది!' అన్నాడు.

తను కవ్వించినా లొంగని అతని ఔన్నత్యం అర్థం చెసుకుంది కావ్య. 'రవిచంద్ర! నేను మీరు డిగ్రీ చదివేటప్పుడు.. ఇంటర్ చదివేదాన్ని.. మీ మంచితనం, వ్యక్తిత్వం మిమ్మల్ని ఎంతో లైక్ చేసేదాన్ని. ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాను. నా భర్త చేసే తప్పులకు విసిగి నేనూ అదే తప్పు చేయాలనుకున్నాను. ఆవేశంలో నిర్ణయం తీసుకున్న ఆ క్షణాన మీరు కనిపించారు. చేయబోయే తప్పుకు మీతోనే శ్రీకారం చుట్టాలనుకున్నాను. ఇప్పుడు సిగ్గుపడుతున్నాను సారీ!' అంది.

'చేసేది తప్పని తెలిసిన వారు.. జీవితంలో ఎన్నడూ తప్పు చేయనివారు.. ఏదైనా తప్పుచేస్తే వారికిమనసు వేసే శిక్ష చాలా ఘోరంగా వుంటుంది కావ్యగారు! అది భరించడం కష్టం.. అదీ కాక.. కాలపరీక్షకు నిలదొక్కుకోగలిగితే, తుది విజయం మనదే అవుతుంది. ఆల్ ది బెస్ట్'బయటకు నడిచాడు రవిచంద్ర.

కావ్య ఆలోచనా రహితంగా బెడ్‌మీద అలాగే వుండిపోయింది. అర్థరాత్రి దాటాక వచ్చాడు ఆమె భర్త. ఎర్రగా జ్యోతుల్లా మెరుస్తున్న ఆమె కళ్ళు చూసి 'సారీ కావ్య! ఇంకెప్పుడూ ఆలస్యంగా రాను' అన్నాడు. ఎన్ని తప్పులు చేసినా అతనెన్నడూ 'సారీ' చెప్పలేదు. అదే ప్రథమం.

కావ్యకు రవిచంద్ర మదిలో మెదిలాడు. ఆమె సూర్యోదయానికే ఎదురు చూడసాగింది.